క్లుప్తంగా

ఒలింపిక్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా కొండపల్లి


కొండపల్లి శ్రీనివాసు

సామర్లకోట: కాకినాడ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా కొండపల్లి శ్రీనివాసు ఎన్నికయ్యారు. జిల్లా అసోసియేషన్ ఎంపికలో భాగంగా సామర్లకోటకు చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు శ్రీనివాసు సహాయ కార్యదర్శిగా ఎన్నిక కావడంపై ప్రోకబడ్డీ రిఫరీ బోగిళ్ల మురళీకుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు తాళ్లూరి వైకుంఠం, నిమ్మకాయల కిరణ్‌కుమార్ తదితరులు ఆదివారం అభినందనలు తెలిపారు.

ఉద్యోగులకు సత్కారం


పదోన్నతి పొందిన రైల్వే సిబ్బందిని సత్కరించిన స్టేషన్ మేనేజర్, తదితరులు

సామర్లకోట: స్థానిక రైల్వే పాయింట్స్ మెన్‌లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు రైల్వే గూడ్స్ గార్డులుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ఆదివారం వారిని స్థానిక రైల్వే స్టేషన్‌లో మేనేజర్ ఎం.రమేష్ ఘనంగా సత్కరించారు. ఆరుగురు పాయింట్స్ మెన్‌లకు 60 శాతం ప్రమోషన్ కోటాలో గూడ్స్ గార్డులుగా పదోన్నతి లభించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు 50 రోజుల శిక్షణ నిమిత్తం సికింద్రాబాద్‌లోని జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌కు వారికి రిలీఫ్ మెమోలు అందజేసి అభినందించారు. రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, రైల్వే సూపరింటెండెంట్ శ్రీధర్, అనంతలక్ష్మి, చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ, టిక్కెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కళారూపాల శిక్షణ ప్రారంభం


పెద్దాపురంలో కళారూపాల శిక్షణలో పాల్గొన్న కళాకారులు

పెద్దాపురం: అభ్యుదయ కవి, కార్మిక నాయకుడు యాసలపు సూర్యారావు 11వ వర్ధంతి సందర్భంగా నాలుగు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం స్థానిక యాసలపు సూర్యారావు భవన్‌లో కళారూపాల శిక్షణ ప్రారంభమైంది. తొలుత యాసలపు సూర్యారావు చిత్రపటానికి సీనియర్ కళాకారుడు దారపురెడ్డి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి కళాకారులు సిరిపురపు బంగార్రాజు, కూనిరెడ్డి రవికుమార్ కళాకారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి కార్యదర్శి రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, శ్రావిక, నమ్రత, పూజ, మంజుల, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని కోరుతూ భజనలు


గొల్లప్రోలులో వర్షాల కోసం భజన చేస్తున్న భజన సంఘాల ప్రతినిధులు

పిఠాపురం: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గి వర్షాలు కురవాలని కోరుతూ గొల్లప్రోలు నగర పంచాయతీలో ఆదివారం నగర సంచార భజన కార్యక్రమం నిర్వహించారు. వివిధ భజన సంఘాలకు చెందిన కళాకారులు కీర్తనలు ఆలపిస్తూ గ్రామంలో భజనలు చేశారు. గ్రామస్తులు వారిపై బిందెలతో నీళ్లు పోస్తూ ఆహ్వానం పలికారు. వాన దేవుడు కరుణించాలని అందరు ఆకాంక్షించారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన

నాగమల్లితోట జంక్షన్: డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ సీనియర్స్ తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆమెను కోచ్ అర్జునరావు ఆధ్వర్యంలో క్రీడాకారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఐదు రజత, ఒక కాంస్య పతకం సాధించడం జిల్లాకు గర్వ కారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్, కోచ్ అర్జునరావు, జాతీయ స్థాయి రిఫరీలు సత్యనారాయణ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

హైక్లాస్‌గా.. హైలైట్‌గా..

- ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవం
- స్మార్ట్ టీవీలతో బోధనకు చర్యలు
- మొదటి విడతలో 13 పాఠశాలలకు మంజూరు


నాడు-నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేసిన ఉండూరు జిల్లా పరిషత్తు హైస్కూల్


సామర్లకోట యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ తరగతి గదిలో ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీ

సామర్లకోట: సర్కారు బడి సరికొత్త ఒరవడిని సంతరించుకుంది.. డిజిటల్ విప్లవానికి నాంది పలికింది.. కార్పొరేట్‌కు ధీటుగా ముందుకు సాగుతోంది.. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రతి ప్రభుత్వ హైస్కూల్‌కు స్మార్ట్ టీవీల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. అగ్ర దేశాల్లో విద్యా బోధనకు వినియోగించే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలను ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా అచ్చంపేట, మేడపాడు, వేట్లపాలెం, నవర, ఉండూరు, వీకే రాయపురం, సామర్లకోట జిల్లా పరిషత్తు హైస్కూల్, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్, బీబీఆర్ హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్‌లకు స్మార్ట్ టీవీలు వచ్చాయి. సామర్లకోట యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌కు 11 స్మార్ట్ టీవీలు మంజూరయ్యాయి. వీటిని ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రతి గదికి ఒక స్మార్ట్ టీవీ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే క్లాస్ రూమ్‌లో ఉన్న గ్రీన్‌బోర్డు స్థానంలో 65 అంగుళాలు ఉన్న స్మార్ట్ టీవీ విద్యార్థులను ఆకర్షించనుంది. ఈ టీవీ ద్వారా పాఠ్యాంశాలు ఒక్కసారి వినగానే, చూడగానే విద్యార్థుల మదిలో నిలిచిపోయేలా చర్యలు తీసుకుంటున్నారు. 2డీ, 3డీ చిత్రాలతో ఆధునిక డిజిటల్ టెక్నాలజీతో పాఠాలు బోధించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కొత్త ఒరవడికి శ్రీకారం

ఇప్పటికే నాడు-నేడుతో ప్రభుత్వ బడులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో పాటు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు ఉచితంగా అందజేసిన విషయం తెలిసిందే. స్మార్ట్ టీవీల ద్వారా పాఠ్యాంశాలు బోధించడానికి ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు. దశాబ్దాలుగా ఉపాధ్యాయులు బోర్డులపై బోధన సాగిస్తున్నారు. గూగుల్ అసిస్టెంట్ సదుపాయం కలిగిన ఇంటరాక్టివ్ స్మార్ట్ ప్యానెళ్లను ప్రతి తరగతి గదికి ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన కంటెంట్ వీడియో, ఆడియో రూపంలో స్మార్ట్ టీవీల ద్వారా బోధన సాగిస్తారు. దీంతో విద్యార్థులలో ఉత్సాహం పెరుగుతుంది.

సులువుగా అర్థమయ్యేలా..



చెప్పేవిధానం కన్నా చూసి నేర్చుకుంటే విద్యార్థులకు సులువుగా అర్థమవుతుంది. ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన అంశాలను దృశ్యాల ద్వారా వివరించడంతో ఎక్కువ కాలం గుర్తు ఉంటుంది. ప్రతి టీవీ రూ.1.21 లక్షల ఖరీదు చేస్తుంది. సైన్సు ప్రయోగాలు వీడియో రూపంలో చూపించడం, బయాలజీకి సంబంధించి వివిధ రకాల ఆకులను చూపిస్తూ విద్యార్థులలో ఆసక్తి పెంచనున్నారు. లెక్కలకు సంబంధించి 2డీ, 3డీ విధానంలో బోధనతో సులభంగా అర్థమవుతుంది.
– యు.సత్యనారాయణ, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, సామర్లకోట

మెరుగైన ఫలితాలకు మార్గం



మండలంలో ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకూ ఉన్న ప్రతి పాఠశాలకూ స్మార్ట్ టీవీలు వస్తున్నాయి. మొత్తం 13 పాఠ శాలలకు ఇవి మంజూరు అయ్యాయి. వాటిని ప్రతి తరగతి గదిలో సాంకేతిక సిబ్బంది బిగించిన తరువాత హెచ్ఎం, ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుంది. డిజిటల్ పాఠాలతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – వై.శివరామకృష్ణయ్య, ఎంఈఓ, సామర్లకోట

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం..


కావమ్మ ఆలయంలో భక్తులతో మాట్లాడుతున్న కమలానంద భారతీ స్వామి

సామర్లకోట: గన్నవరం శ్రీభువనేశ్వరీ పీఠానికి చెందిన కమలానంద భారతీ స్వామి ఆదివారం సామర్లకోటలోని వివిధ ఆలయాలను సందర్శించారు. స్థానిక ఏలూరు కాలువ రజకపేట వద్ద వేంచేసి ఉన్న కావమ్మ ఆలయాన్ని సందర్శించి ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. హిందూ ఐక్య సంఘ నియోజకవర్గ నాయకుడు జీవీకే మోహనరావు, కావమ్మ ఆలయ కమిటీ సభ్యులు సుకపట్ల బాబ్జి, నాగరాజు, మారయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బలుసులపేట రామాలయంలో కమలానంద స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన స్వామికి కౌన్సిలర్ నేతల హరిబాబు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కర్రి ఆదినారాయణరెడ్డి, మారిన రాంబాబు, నేతల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ భవన నిర్మాణానికి నిధుల మంజూరు

- ఎమ్మెల్యే దొరబాబుకు సత్కారం


ఎమ్మెల్యే దంపతులను సత్కరిస్తున్న చేనేత సంఘాల నాయకులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో చేనేత సొసైటీ నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో సంఘ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే పెండెం దొరబాబును ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చేనేత సొసైటీ చైర్మన్ సూరిశెట్టి సూరిబాబు, నాయకులు తెడ్లపు నాగేంద్ర, గంటా అప్పలస్వామి, కొల్లి వీరబాబు తదితరులు మాట్లాడుతూ ఎప్పటి నుంచో చేనేత సొసైటీ భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఎన్నో సార్లు ఎందరో నాయకులను కలిసి భవనం నిర్మించాలని కోరామన్నారు. ఎవరూ స్పందించలేదని, ఎమ్మెల్యే పెండెం దొరబాబును కలిసి గతంలో సమస్య వివరించామన్నారు. దీంతో స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. వెంటనే అధికారులు అంచనా వేసి నివేదికలు ఇవ్వగా రూ.25 లక్షలు మంజూరు చేసారని తెలిపారు. ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు చేనేత సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత వీపీఎల్ జట్టు


విజేత జట్టుకు షీల్డ్ అందిస్తున్న నిర్వాహకులు

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు సూచించారు. మండలంలోని వాకతిప్పలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ టోర్నీలో 12 టీములు పాల్గొనగా విజేతగా వీపీఎల్ జట్టు నిలిచింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎంతో మంది క్రీడాకారులు ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కీడాకారులను ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ

కాకినాడ కల్చరల్: పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఆదివారం యోగా ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవ ఆనంద్ మాట్లాడుతూ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు యోగాపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. జగదీష్, శ్రీరామచంద్రమూర్తి, శివశంకర్ పాల్గొన్నారు.



సన్ డే

సామర్లకోట గాంధీచౌక్‌లో నిర్మానుష్యంగా రోడ్డు


నిర్మానుష్యంగా మారిన ఉప్పాడ బీచ్ రోడ్ సెంటర్

సామర్లకోట: రోహిణీ కార్తె ముగిసినా భానుడు నిప్పులు చెరుగుతూనే ఉన్నాడు. ఆదివారం తెల్లవారు జామున వర్షం కురవడంతో వాతావరణం చల్లబడుతుందని అంతా భావించారు. ఎండలతో వేడి గాలులు వీయడంతో ప్రజలు హడలిపోతున్నారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు తెరిచి సోమవారం నుంచి రెండు పూటలా తరగతులు ఉంటాయని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రకటనలు చేయడంతో తమ పిల్లలను ఏవిధంగా పాఠశాలలకు పంపాలని భయపడుతున్నారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. సాయంత్రం ఆరు గంటలైనా వేడి తగ్గకపోవడంతో జనం అల్లాడిపోయారు. 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిత్యం రద్దీగా ఉండే అనేక రోడ్లు మండే ఎండలకు నిర్మానుష్యంగా మారాయి.

మండిస్తున్న ఎండ

కొత్తపల్లి: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో గత మూడు రోజులుగా 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకూ వడగాడ్పులు వీచాయి. ప్రజలు ఎండకు భయపడి ఇళ్లకే పరిమితం అయ్యారు. వడగాడ్పులకు చిన్నా, పెద్దా తేడా లేకుండా విలవిల్లాడారు. ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందడానికి మజ్జిగ, కొబ్బరి నీళ్లు, బార్లి, చెరకు రసం, పండ్ల రసాల కోసం పరుగులు తీశారు. ఎండలకు నిత్యం రద్దీగా ఉండే రహదారులు నిర్మానుష్యంగా మారాయి. మూగజీవాలు సైతం ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మండలానికి చెందిన పలువురు ఉప్పాడ తీరానికి వెళ్లి ఎండ నుంచి ఉపశమనం పొందారు.

వైభవంగా మరిడమ్మ సంబరం


మరిడమ్మ జాతర సందర్భంగా గరగ నృత్యాలు


సంబరంలో భక్తజన కోలాహలం

పెద్దాపురం: ఆషాఢ మాసంలో ఏటా జరిగే మరిడమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా తొలి ఆదివారం పెద్దాపురం చేపల వీధి సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక గంగాభవాని ఫిషర్‌మెన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరానికి భక్తులు పోటెత్తారు. గరగ నృత్యాలు, శక్తి వేషధారణలు, బ్యాండ్ మేళాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టారు.

కేసులు ఎత్తివేయాలని డిమాండ్


విమలక్కపై కేసులు ఎత్తి వేయాలని ధర్నా చేస్తున్న రైతు కూలీలు

పెద్దాపురం: అరుణోదయ సమాఖ్య జాతీయ చైర్ పర్సన్ విమలక్క, మోహన్‌బైరాగి తదితరులపై కేంద్ర, తెలంగాణ ప్రభుత్వాలు పెట్టిన ఉప చట్ట కేసులను సత్వరమే ఎత్తివేయాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. గోరింట పంట పొలాల్లో ఆదివారం రైతు కూలీలతో కలసి ఆయన ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన కలాన్ని, గళాన్ని ఉపయోగించి ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతున్న విమలక్క, బైరాగిలపై అక్రమంగా కేసులు పెట్టడం దారుణమన్నారు. ప్రజా గొంతును నొక్కే విధంగా తెలంగాణ ప్రభుత్వం నియంతృత్వ పాలన సాగిస్తుందన్నారు. సంఘ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజుబాబు, బి.రమేష్, కుంచే అంజిబాబు, దేశెట్టి సురేష్, వీరబాబు, వల్లూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తపల్లి: రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. మండలంలోని రమణక్కపేటలో ఆదివారం ఆయన పర్యటించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి తదితరులు ఉన్నారు.

రండీ.. చదువుకుందాం

- ఐడియల్ కళాశాలలో 18 హానర్స్ కోర్సులు
- 19 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ


ప్రాక్టికల్స్ చేస్తున్న ఆక్వాకల్చర్ కోర్సు విద్యార్థులు



కాకినాడలో ఐడియల్ కళాశాల

విభాగం	కోర్సు	సీట్లు
బీఏ (హానర్స్)	ఎకనామిక్స్	30
బీఏ (హానర్స్)	పొలిటికల్ సైన్స్	30
బీకామ్ (హానర్స్)	జనరల్	60
బీకామ్ (హానర్స్)	జనరల్ (ఈ-కామర్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్)	60
బీకామ్ (హానర్స్)	కంప్యూటర్ అప్లికేషన్స్	110
బీఎస్సీ (హానర్స్)	మ్యాథమెటిక్స్	50
బీఎస్సీ (హానర్స్)	కెమిస్ట్రీ	76
బీఎస్సీ (హానర్స్)	జువాలజీ	46
బీఎస్సీ (హానర్స్)	అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్	60
బీఎస్సీ (హానర్స్)	ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్	48
బీఎస్సీ (హానర్స్)	కంప్యూటర్ సైన్స్	96
బీఎస్సీ (హానర్స్)	ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్	48
బీఎస్సీ (హానర్స్)	ఫిషరీస్	50
బీఎస్సీ (హానర్స్)	ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ	48
బి.ఒకేషనల్ (హానర్స్)	ఫిషరీస్	50
బీసీఏ (హానర్స్)	బీసీఏ	50
బీబీఏ (హానర్స్)	డిజిటల్ మార్కెటింగ్	60
బీబీఏ (హానర్స్)	జనరల్	60

బాలాజీచెరువు (కాకినాడసిటీ): సరికొత్త విద్యకు నాంది పలికింది.. జాతీయ విద్యా విధానంలో భాగంగా కొత్త కోర్సులు చదివేందుకు అవకాశం వచ్చింది.. పాత విద్యా విధానం, సంప్రదాయ కోర్సులకు స్వస్తి పలికి భారత ప్రభుత్వం ఆమోదించిన నూతన జాతీయ విద్యా విధానం (NEP–2020)లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త హానర్స్ డిగ్రీని ప్రవేశపెట్టింది. కాకినాడలో పేరొందిన కళాశాల ఐడియల్ (అటానమస్) కళాశాలకు ఈ అవకాశం చేజిక్కింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో న్యాక్ గుర్తింపు పొందిన తొలి కళాశాల ఇదే కావడం విశేషం. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఐడియల్ కళాశాలలో నూతన కోర్సులను ప్రవేశపెట్టామని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి వివరించారు. పోటీ ప్రపంచంలో మారుతున్న టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకుని తమ భవితకు బంగారు బాటలు వేయడానికి కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి 18 హానర్స్ కోర్సులను ప్రారంభించింది. గత మూడేళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, అగ్రికల్చర్, ఫుడ్ సైన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వంటి కోర్సులను ప్రారంభించడంతో ఇప్పటికే అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రయోజనం పొంది వివిధ పేరున్న సంస్థల్లో ఉద్యోగాలు సంపాదించారు. అదే విధంగా ఈ విద్య సంవత్సరం 18 హానర్స్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఐడియల్ కళాశాల ఇంద్రపాలెం (సామర్లకోట రోడ్) క్యాంపస్‌లో 8 కోర్సులు, విద్యుత్‌నగర్ క్యాంపస్‌లో 10 రీస్ట్రక్చర్డ్, స్కిల్ ఓరియంటెడ్ కోర్సులు నిర్వహిస్తారు. దీనికోసం ఈ నెల 19 నుంచి 24 వరకూ ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. 26 నుంచి 30 వరకూ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. జులై 3న సీట్లు కేటాయిస్తారు. అనంతరం 4 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

న్యాక్-బి గుర్తింపు

ఐడియల్ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడేషన్ కౌన్సెల్ (న్యాక్) గుర్తింపు ఉంది. సాంకేతిక ప్రపంచంలో విద్యార్థులు పాఠాలు సులువుగా అర్థం చేసుకునేందుకు ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ద్వారా బోధన అందిస్తున్నారు. 24 గంటల గ్రంథాలయం వినియోగంతో పాటు వివిధ మల్టీనేషనల్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. 2022–23లో 300 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలు పొందగా ప్రారంభ వేతనం ఏడాదికి రూ.3.50 లక్షల నుంచి పొందుతున్నారు. ప్రభుత్వం అందజేసే జగనన్న విద్యాదీవెన వంటి పథకాలు విద్యార్థులకు కొండంత ఆసరాగా నిలుస్తున్నాయి.

వంద శాతం ఉద్యోగావకాశాలు



ఈ ఏడాది కళాశాలలో సింగిల్ మేజర్ సబ్జెక్టుల విధానం అమల్లోకి వచ్చింది. జిల్లాలో అత్యధిక కోర్సులున్న కళాశాల ఇదే. వంద శాతం ఉద్యోగ అవకాశాలు ఉండే కోర్సులకు ప్రాధాన్యం కల్పించాం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో హానర్స్ డిగ్రీ పూర్తి చేసిన వారికి మంచి భవిష్యత్తు ఉంది. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన సాగిస్తున్నాం. ప్రాంగణ ఎంపికలు నిర్వహించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం.
– డాక్టర్ పి.చిరంజీవిని కుమారి, కరస్పాండెంట్, ఐడియల్ కళాశాల